క్లుప్తంగా

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయంలో స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేసినానంతరం భక్తులకు దర్శనం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని కనులారా దర్శించుకున్నారు.

8న మెగా వైద్య శిబిరం

గోకవరం: గ్రామంలో ఈ నెల 8న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో శ్రీశాంతి ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు ప్రథమ్ ఫౌండేషన్‌పై అవగాహన

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులకు ప్రథమ్ ఫౌండేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం శాప్, ఐటీసీ సహకారంతో కోడ్ ఉన్నతి ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ యొక్క స్టేట్ హెడ్ జి.లోకరాజు నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించారు. బలభద్రపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం సీవీవీ సత్యనారాయణమూర్తి, అనపర్తి శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి,ఫౌండేషన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.శ్రీకాంత్, టీం లీడర్స్ వై.వైశాలి, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి



చంద్రేడులో లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

రంగంపేట: ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జాము నుంచే వలంటీర్లు తలుపుతట్టి ఇచ్చే పింఛన్ల పంపిణీ మండలంలో 90 శాతం పూర్తయింది. మండలంలో మొత్తం 8855 మంది లబ్ధిదారులుండగా ప్రభుత్వం రూ.2,43,30,750 మంజూరు చేసింది.

తాటాకిల్లు దగ్ధం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని తాటాకు ఇల్లు దగ్ధమైంది. ఆదివారం జరిగిన ఈ సంఘటన సుమారు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం వచ్చినట్టు అనపర్తి ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. పందలపాక ఎస్సీపేటలో వారా సూరమ్మ తన ఇంటిలో వంట చేస్తుండగా మంటలు ఎగసిపై ఇంటిపై కప్పు అంటుకుంది. మంటలు వ్యాప్తించడంతో చుట్టు పక్కల యువకులు ఆమె బయటకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే చాలా వరకు కాలిపోయింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం.. ఈ రోజు అందుకున్న పింఛను నగదు, సూరమ్మ దాసుకున్న నగదు రూ.15వేలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. మెత్తం రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించినట్లు ఫైర్ అధికారి తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



చిన్నసూరమ్మ సత్కరిస్తున్న బీఎల్‌వో సురేష్

బిక్కవోలు: మండలంలోని అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం బీఎల్‌వోలు తమ పరిధిలో ఉన్న 80ఏళ్ల ఓటర్లను సత్కరించారు. దీనిలో భాగంగా పందలపాక సచివాలయం-1 పరిధిలో ఉన్న బూత్ 68గల బీఎల్‌వో సూరిశెట్టి సురేష్ తమ పరిధిలో వృద్ధురాలు గోత్రిపోటి చిన్నసూరమ్మను ఇంటివద్దకి వెళ్లి సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వో సూపర్‌వైజర్ ఆర్ఐ ఏపీఎల్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు చెక్ పెడుతూ..

- అంగన్‌వాడీలో నూతన సంస్కరణలు
- ఫేస్ యాప్ ద్వారా టీహెచ్ఆర్ పంపిణీ
- సంపూర్ణ పోషణ కిట్లలో 10 రకాల సరకులు



రామవరంలో పోష్టికాహారం కిట్లతో లబ్ధిదారులు

బిక్కవోలు: మాతా శిశు సంరక్షణలో పాటు పూర్వ ప్రాథమిక విద్యా బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి, సదుపాయాలు కల్పిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్యనభ్యసించే మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలోనే మధ్యాహ్నం వేడివేడిగా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేవారు. అయితే నెలలు నిండిన గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు కేంద్రాల వద్దకు రాలేకపోవడంతో పోష్టికాహారం తీసుకోలేక ఇబ్బందులు పడుతుండడాన్ని ప్రభుత్వం గుర్తించిది. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కిట్లతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం, పాలు, కొడిగుడ్డు వంటివి టేక్‌హోమ్ రేషన్(టీహెచ్ఆర్) కింద ఇంటి వద్దకే ఇచ్చేలా కార్యాచరణ చేపట్టింది. సరకులు పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఫేస్(ముఖ ఆధారిత) యాప్ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

నియోజకవర్గంలోని 265 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1,354 మంది గర్భిణులు, 1,192 బాలింతలు, 6 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 6,581 మంది, మూడేళ్ల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 2,922 మంది ఉన్నారు.

నెలకు పంపిణీ చేసే సరకులు

బియ్యం	-	3 కిలోలు
కందిపప్పు	-	కిలో
అటుకులు	-	కిలో
రాగి పిండి	-	2 కిలో
పామాయిల్	-	500 ఎంఎల్
పాలు	-	2.5 లీటర్లు
బెల్లం	-	250 గ్రాములు
వేరుశనగ చిక్కీ	-	250 గ్రాములు
ఎండు ఖర్జురం	-	250 గ్రాములు
కోడిగుడ్డు	-	25

టీహెచ్ఆర్ విధానంతో..



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సరకులన్నీ ముఖ అధారిత యాప్ ద్వారా పారదర్శకతంగా పంపిణీ చేస్తున్నాం. సరకుల్లో చాలా వరకు ప్రభుత్వంమే ప్యాకింగ్ చేసి పంపిస్తోంది. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చేశారు. నాణ్యమైన పోష్టికాహారం అందుతోంది. ఇంటికే సరకులు (టిహెచ్ఆర్) పంపిణీ చేసే విధానం చాలా బాగుంది.

– జామి మోహన్ శ్రీలక్ష్మీదేవి, గర్భిణి, పందలపాక

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



వైఎస్సార్ సంపూర్ణ షోషణ ద్వారా అంగరన్‌వాడీ కేంద్రం నాణ్యమైన సరకులు అందజేస్తున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం సమతుల ఆహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలంతా రుణపడి ఉంటాం, షోషికాహారం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగిపడుతోంది. రక్త హీనత నుంచి గట్టెక్కుతున్నాం.

– చధరవాద జ్యోతి, బాలింత, పందలపాక

ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా వ్యవసాయాభివృద్ధి

ఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్ వర్మ



మధురపూడి: ఆర్‌డీఎస్‌ఎస్ (రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ స్ట్రగన్ సిస్టమ్) ద్వారా వ్యవసాయభివృద్ధి జరుగుతోందని ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ శ్రీధర్ వర్మ తెలిపారు. ఆదివారం కోరుకొండ విజిట్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు, దానిలో భాగంగానే ఆర్‌డీఎస్‌ఎస్ విధానాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న ఈ స్కీమ్ ద్వారా గ్రామీణ ప్రాంతవాసులకు త్రీ ఫేజ్ సదుపాయం ఉంటుందని, తద్వారా విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా నిరంతరాయంగా సరఫరా జరుగుతోందన్నారు. రాగల కాలంలో పట్టణాల తరహాలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆటంకాలుండవన్నారు. ఓవర్‌లోడ్ ఫీడర్లను విడదీసి విద్యుత్ సరఫరా చేసున్నట్టు తెలిపారు. ఈ స్కీమ్‌లో సబ్ స్టేషన్‌ల నిర్మాణం జరగుతోందన్నారు.

గ్రామాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పెదపూడిలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



కోరుకొండలో స్వచ్ఛతా హి సేవాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు



కొమరిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ జ్యోతిర్మయి



కోటిలింగాల రేవులో విద్యార్థులు శ్రమదానం చేస్తున్న గైట్ విద్యార్థులు



శ్రమదానం చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు

పెదపూడి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో ఆ గ్రామంలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఈఓపీఆర్డీ ఎం.ఎస్.ఎస్.రెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రోడ్లను ఊడ్చి చెత్త, చెత్త కుప్పలను తొలగించారు. స్థానిక మార్కెట్‌సెంటర్లో ఎంఎస్ఎస్ రెడ్డి, సర్పంచి కలవల కృష్ణమూర్తి, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ మార్ని వెంకట్రావు, సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యుడు కోరా బాబి తదితరులు చెత్తను చీపురకట్లు చేత పట్టి ఊడ్చారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలన్నారు. తద్వారా సీజనల్‌గా వచ్చే వ్యాధులు దూరమవుతాయన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం సోమవారంతో ముగిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల చేనేత విభాగం కన్వీనర్ తిప్పాన వెంకటరమణ, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కోరుకొండలో స్వచ్ఛతా సేవా

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం జరిగింది. బస్‌స్టాండ్ పరిసరాల పరిశుభ్రం కార్యక్రమం జరిగింది. ఏక్ తారీక్-ఏక్ ఘంటే స్ఫూర్తితో కార్యక్రమాన్ని నిర్వహించారు. గంట పాటు జరిగిన కార్యక్రమం స్థానికులకు స్ఫూర్తిగా నిలిచింది. దీనిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కోరుకొండలోని శ్రీలక్ష్మీన రసింహ స్వామి దేవస్థానం రోడ్డు, బస్‌స్టాండ్ సెంటర్ పరిసరాలను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతినీడి అశోక్, నాయకులు బొరుసు బద్రి, పంచాయతీ సెక్రటరీ రమేష్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

బిక్కవోలు: కొమరిపాలెంలోని స్వచ్ఛత హి సేవపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సర్పంచి వాసంశెట్టి రవికుమార్, ఉప సర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు రోడ్లపు శుభ్రపరిచి, గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పందలపాక గ్రామంలోని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి, సచివాయలం సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు.

రాజానగరం నియోజకవర్గంలో..

రాజానగరం: నియోజకవర్గంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు పలుచోట్ల అధికారులు, ప్రజలు భాగస్వామ్యంతో జరిగాయి. మండలంలోని చక్రద్వారబంధంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల సహకారంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టి, గ్రామంలో రోడ్లు, డ్రైన్లను పరిశుభ్రపరిచారు. నినాదాలతో ప్రజలకు పరిశుభ్రత ఆవశ్యకతను, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, ప్రజలను చైతన్యపరిచారు. గైట్ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపర్చడంతోపాటు డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓఎన్‌జీసీ సహకారంతో రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవులో పరిశుభ్రత కోసం శ్రమదానం చేశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అనపర్తి: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రజారోగ్య పరిరక్షణ అందరి బాధ్యతని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని రామవరంలో సర్పంచ్ గిరడా గంగాభవాని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, సచివాలయ కార్యదర్శులు పీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా..

- ఘనంగా గణేశ్ నిమజ్జనాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత, మహిళలు



అభయ గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు, పార్టీ నాయకులు



పెదపూడిలో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు



కొంకుదురులో అన్నసమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు

గోకవరం: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను తీన్ మార్ డ్యాన్సులు, బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. గణపతి ఊరేగింపులో యువత, మహిళలు సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అభయ గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి: గణపత్తి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిన పాలమూరులోని శ్రీ అభయ గణపతి, దుర్గమ్మ ఆలయంలో కొలువుతీర్చిన విఘ్నేశ్వరుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి నిమజ్జన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులను కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

పెదపూడి: గ్రామంలో ఆదివారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రామ సచివాలయం వద్ద హైస్కూల్ గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. యువకులు, వివిధ నృత్యాలు, డప్పులు వాయిద్యాలు, మేళాతాలతో పెద్ద ఎత్తున బాణసంచా మధ్య ఊరేగింపు గ్రామంలోని మెయిన్‌రోడ్డు, గౌరీదేవి వీధి, మార్కెట్ సెంటర్, శివాలయం, సంఘం సెంటర్ తదితర ప్రధాన వీధులగుండా సాగింది. కమిటీ వారు తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం కరకుదురు శివారు కరపలో పెద్ద కాలువలో నిమజ్జనం చేశారు.

కొంకుదురులో అన్న సమారాధన

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా కొంకుదురు గ్రామంలోని మార్కెట్ సెంటర్ వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిన్నం వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వారపూడి వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, మల్లిడి బాబ్బి పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించడం బాధ్యత



ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం సిటీ: కన్న తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వృద్ధులు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను వారి కోసం ఖర్చు పెట్టుకుని చివరి దశలో ఆనందంగా గడపాలని కోరారు. పిల్లల పట్ల అవ్యాజమైన ప్రేమానురాగాలతో సంపాదించిందంతా మరల తిరిగి కుటుంబ సభ్యులకి ఇవ్వాలనుకోవడం సరి కాదని ఆమె అభిప్రాయపడ్డారు. వృద్ధులకు ఎలాంటి న్యాయ సహాయం కావలసినా తమ వద్దకు తీసుకురావాలని ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు రాంబాబుకి సూచించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ వృద్ధులు నిరాశ్రయుల కోసం చాలా మంచి సేవలు అందిస్తుందని ఆమె కొనియాడారు. వృద్ధుల వికలాంగుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు బీ.రామ్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోందని, కావలసిన ఊతకర్రలను, ఇతర అవసరమైన ఉపకరణాలను వృద్ధులు పొందవచ్చునన్నారు. తొలుత ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని వృద్ధుల సమక్షంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు ఏర్పాటు చేసిన కాస్మోటిక్స్, పండ్లు, చీరలు, దుప్పట్లు 100 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర సభ్యులు డాక్టర్ ఆనంద్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ ఇలియాస్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వేంద్రలో పోలీసుల వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

పెదపూడి: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. వేంద్ర గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులకు వారధి కార్యక్రమం ఎస్సై పి.వాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళల చట్టాలపై వివరించారు. మహిళలపై మంచిగా ప్రవర్తించాలన్నారు. ప్రమాదబారిన పడకుండా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తుకులోనై వారి విలువైన జీవితాన్ని, భవిష్యత్తు కోల్పోతున్నారన్నారు. మత్తుపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు , సర్పంచి కోసూరి శ్రీనివాసు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: నల్లమిల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎస్ఈబీ అధికారులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు.

తోరాట శ్రీను కుటుంబానికి పరామర్శ

మధురపూడి: వైఎస్సార్ సీపీ నాయకుడు తోరాట శ్రీను కుటుంబాన్ని ప్రముఖులు ఆదివారం పరామర్శించి సంతాపాన్ని ప్రకటించారు. ఆయన తల్లి, గాదరాడ కనకదుర్మ ఆలయ పూజారి, అనంతలక్ష్మి ఇటీవల మృతి చెందారు. 1990 సంవత్సరంలో దర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని గాదరాడలో నిర్మించి, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆమె మృతితో శ్రీను కుటుంబా సభ్యులకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఫోన్ ద్వారా సంతాపాన్ని ప్రకటించారు.

దర్శకులకే దర్శకుడు ఆదుర్తి

వర్ధంతి సభలో పలువురి నివాళి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించి, ఆ రోజుల్లో తెలుగు సినీ ఖ్యాతిని ఇనుమడింప జేశారని పలువురు పేర్కొన్నారు. దర్శకులకే దర్శకుడైన ఆదుర్తి రాజమండ్రి వాసి కావడం మన అదృష్టమన్నారు. అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో స్థానిక జిత్‌మోహన్ మిత్రా కళావేదిక దగ్గర ఆదివారం ఉదయం ఆదుర్తి సుబ్బారావు వర్ధంతి, అక్కినేని నాగేశ్వరరావు నటించిన దొంగరాముడు సినిమా 68 వసంతాల వేడుక సంయుక్తంగా నిర్వహించారు. నటగాయకులు జిత్ మోహన్ మిత్రా మాట్లాడుతూ ఆదుర్తి సుబ్బారావుతో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దర్శకుడు కావాలన్న ఉద్దేశంతో ఆరోజుల్లో బొంబాయి వెళ్ళిపోయి శిక్షణ పొంది, అమర సందేశం సినిమాతో దర్శకుడయ్యాడని, మూగమనసులు సినిమా గోదావరి తీరంలో తొలి అవుట్ డోర్ చిత్రంగా తీసి సంచలన విజయం అందుకున్నారని వివరించారు. ఇదే సినిమా మిలన్ పేరుతో హిందీలో కూడా దర్శకత్వం వహించి అక్కడ కూడా విజయం సాధించారని అన్నారు. దొంగరాముడు సినిమా అద్భుత విజయం అందుకుందని పేర్కొన్నారు. అడబాల మరిడయ్య మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ ఆదుర్తి సుబ్బారావు రాజమండ్రి వాసి కావడం మన అదృష్టమన్నారు. ప్రస్తుతం బాహుబలి సినిమాతో పశ్చిమ గోదావరి జిల్లా వాసి రాజమౌళి తెలుగు సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చారని ఆరోజుల్లో జాతీయ ఖ్యాతిని మూగ మనసులు సినిమా ద్వారా ఆదుర్తి తెచ్చారని గుర్తు చేశారు. అక్కినేని అభిమాన సంఘం నాయకుడు ఏఎస్ ఆనంద్, వి.జగపతి, గిరజాల సోమరాజు నాయుడు మాట్లాడుతూ ఆదుర్తిని కీర్తించారు. సుక్కురెడ్డి శ్రీనివాసరావు, పి.మహేష్, బీఎస్ఎన్ఎల్ మూర్తి, డీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీల మహాసభను విజయవంతం చేయండి

ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బోస్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్, చిత్రంలో ఎంపీ బోస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల మూడవ వారంలో నిర్వహించబోయే బీసీల మహాసభను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుబాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. ఆదివారం శాటిలైట్ సిటీ గ్రామంలో జక్కంపూడి రామ్మోహనరావు కమ్యూనిటి హాల్లో బీసీల మహాసభ సన్నాహక సమావేశం రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన జరిగింది. పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సంక్షేమానికి ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులలో బీసీలకు సముచిత స్థానం కల్పించి గౌరవిస్తున్నారన్నారు. బీసీలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలబడి రాబోయే ఎన్నికలలో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో బీసీ సంఘీయుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాబోయే ఎన్నికల ముందే మన మందం ఈ బీసీ మహాసభలో కలుసుకుని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి బీసీలంతా అండగా నిలుస్తామన్న భరోసా ఇవ్వాలని చందన కోరారు. రూరల్ నియోజకవర్గ పరిశీలకులు పేరి కామేశ్వరరావు(పీకే రావు), వైఎస్సార్ సీపీ నేతలు, బీసీ సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.